www.prajasakti.com

ప్రజాశక్తి

ఆదివారం 13 ఆగస్టు 2023


5



తిరుపతి



తిరుపతి ఆర్డీవో కార్యాలయం ఎదుట ఫ్యాప్టో నిరసన



'అయ్యో... లక్షిత..

- చిరుత దాడిలో బలి
- నడకదారిలో విషాదం
- టిటిడి నిర్లక్ష్యం వల్లేనా..!

ప్రజాశక్తి - తిరుమల/ కోవూరు

కొన్నాళ్ల క్రితం జూన్ 23న నడకదారిలో వెళుతున్న ఆరేళ్ల కౌశిక్‌పై చిరుత దాడికి పాల్పడింది.. భక్తులు పెద్దగా అరవడంతో బాలుని వదిలేసి వెళ్లింది. గాయపడిన బాలుడు ఆస్పత్రిలో చికిత్స పొంది మృత్యుంజయుడై ఇంటికెళ్లాడు.. 'దేవుడే కాపాడాడు' అని ఓ సమీక్షా సమావేశంతో టిటిడి సరిపుచ్చింది.. అపుడే నడకదారిలో భక్తుల భద్రత విషయాన్ని టిటిడి సీరియస్‌గా తీసుకుని ఉంటే చిరుత దాడిలో బాలిక లక్షిత బలయ్యేది కాదేమో.. తల్లిదండ్రులు దినేష్‌కుమార్, శశికళలకు కడుపుకోత ఉండేది కాదు.. కొద్ది నెలల్లోనే ఈ రెండు ఘటనలు.. ఏడాదిగా పరిశీలిస్తే ఎన్నో ఘటనలు.. అయినా తిరుమల తిరుపతి దేవస్థానం ఈ విషయంలో నిర్లక్ష్యంగా ఉండటం వల్లనే భక్తులకు భద్రత లేకుండా పోయిందన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. కౌశిక్‌ను రక్షించిన దేవుడు లక్షితను ఎందుకు కాపాడలేకపోయాడో టిటిడి ఉన్నతాధికారులు చెప్పాల్సి ఉంది. కేవలం రూ.10 లక్షలు ఎక్స్‌గ్రేషియో ప్రకటించి, భద్రతను కట్టుదిట్టం చేస్తామని టిటిడి ఛైర్మన్ భూమన కరుణాకర్‌రెడ్డి, ఈవో ఎవి ధర్మారెడ్డిలు మరోసారి ఉద్ఘాటించడం గమనార్హం. లక్షిత మృతితోనూ తూతూమంత్రంగా సమీక్ష నిర్వహించిన టిటిడి ఉన్నతాధికారులు ఇలాంటి ఘటన పునరావృతం కాకుండా శాశ్వత పరిష్కారం చూడగలరేమో వేచి చూడాల్సిందే.

భక్తుల భద్రతపై నిర్లక్ష్యమెందుకు?

భక్తులు బాగుంటేనే టిటిడికి కోట్లల్లో ఆదాయం వస్తుంది. అలాంటిది భక్తుల భద్రతపై టిటిడి ఉన్నతాధికారులు మీనమేషాలు లెక్కిస్తున్నారన్న విమర్శలు లేకపోలేదు. తిరుమల తిరుపతి దేవస్థానం ఏడుకొండల్లోని అటవీ ప్రాంతంలో ఉంది.. వన్యప్రాణులు సంచరించే ప్రాంతం.. క్రమేపీ తిరుమల విస్తీర్ణం పెరుగుతుండడంతో జంతుజాలం భక్తుల చెంతకు వస్తున్నాయి. ఎన్నోసార్లు ఆరేడు అడుగుల పెద్దపెద్ద నాగుపాములను సైతం భక్తుల విశ్రాంతి గృహాల వద్దనే పట్టుకున్న ఘటనలు ఉన్నాయి. ఘాట్‌రోడ్లపై చిరుతలు, ఎలుగుబంట్లు, జింకలు అపుడపుడూ కనిపిస్తూనే ఉంటాయి. కౌశిక్ ఘటనలో భక్తులు గుర్తించి వెంటనే పెద్దగా అరిచారు కాబట్టి బతికి బయట పడ్డాడు. లేకుంటే.. అంటేనే ఒళ్లు గగుర్పొడుస్తుంది.. అయితే ఆ ఘటన తర్వాతనైనా టిటిడి ఉన్నతాధికారులు తీసుకున్న చర్యలేంటో చెప్పాల్సి ఉంది. నడకదారిలో ఇరువైపులా రాత్రిపూట కృత్రిమ విద్యుత్ అగ్గి మంటలను ఏర్పాటుచేయాలి. నడకదారిలో పిల్లల్ని ఖచ్చితంగా వెంట ఉండి తీసుకెళ్లాలని అక్కడకక్కడ బోర్డుల్లో సూచించాలి. అంతేకాదు రక్షణ సిబ్బంది సైతం భక్తులను ఆ విధంగా హెచ్చరించాలి. అలాగాకుండా ఒంటరిగా వదిలేయడం వల్లే పులి ఎత్తుకెళ్లిందని, ఇది తల్లిదండ్రుల తప్పన్నట్లుగా సిసి పుటేజిల్లో చూసి చెప్పడం అనేది భక్తులకు 'రాంగ్ మెసేజ్'ను ఇచ్చినట్లే. కేరళ రాష్ట్రం శబరిమల నడకదారిలోకి పులులు రాకుండా ఎలాంటి జాగ్రత్తలు తీసుకుంటున్నారో అధ్యయనం చేయాలి. ఖచ్చితంగా నడకదారి మార్గంలో ఫారెస్టు అధికారులతో సమన్వయం చేసుకుని 'కంచె' వేయడం ద్వారానే ఈ సమస్యకు పరిష్కారం అని మేధావులు చెబుతున్నారు. మనిషి రక్తం రుచి చూసిన మృగాలు ఊరికే ఉండబోవనీ హెచ్చరిస్తున్నారు. పటిష్టమైన భద్రతా వ్యవస్థ ఉందన్న టిటిడి గంటలు గడుస్తున్నా బాలికను చంపిన జంతువేదో చెప్పలేకపోవడం గమనార్హం. టిటిడి డిఎఫ్ఒ ఎలుగుబంటి చంపి ఉండొచ్చు అని చెబుతుంటే, రుయా అధికారులు పోస్టుమార్టంలో చిరుతే చంపిందని స్పష్టం చేస్తున్నారు. ఎందుకింత అస్పష్టమైన భద్రతనేది విచారణలో తేలాల్సి ఉంది



శోకసంద్రంలో పోతురెడ్డిపాలెం

తిరుమల శ్రీవారి దర్శనానికి వెళ్లడంతో అక్కడ చిరుత దాడిలో మతి చెందిన లక్షిత (6) మతదేహాన్ని శనివారం కోవూరు మండలంలోని పోతిరెడ్డి పాలెం గ్రామానికి తీసుకొచ్చారు. చిన్నారి మతి దేహాన్ని చూసిన తల్లిదండ్రులు దినేష్, శశికళ తమ బిడ్డను చిరుత చంపేసిందయ్యా అంటూ కన్నీటి పరమవడంతో చూపరులను కలిచివేసింది. చిరుత దాడిలో మతి చెందిన చిన్నారి లక్షిత మతదేహాన్ని చూసేందుకు పోతిరెడ్డి పాలెం గ్రామంతో పాటు చుట్టుపక్కల గ్రామాలకు చెందిన ప్రజలు పెద్ద ఎత్తున చేరుకోవడంతో గ్రామం మొత్తం శోక సంద్రంలో మునిగిపోయింది. పోతిరెడ్డి పాలెం గ్రామానికి చెందిన దినేష్, శశికళ దంపతులకు లక్షిత (6) నిఖిత్ (4) ఉన్నారు. తండ్రి దినేష్ ఆటో నడుపుతూ కుటుంబాన్ని ఎంతో అన్యోన్యంగా చూసుకునేవారు. ఇరువురు చిన్నారులను కోవూరులోని ప్రయివేట్ పాఠశాలలో చదివించుకుంటున్నారు. దినేష్ తన కుటుంబంతో పాటు చెన్నూరులో ఉన్న తన చెల్లి కుటుంబంతో కలిసిమొత్తం పదిమంది శ్రీవారి దర్శనానికి శుక్రవారం వెళ్లారు. దేవుని మొక్కుబడిని తీర్చుకోవడంలో భాగంగా అలిపిరి కాలినడక మార్గంలో శుక్రవారం 3.45 గంటల సమయంలో మెట్లపై నడక ప్రారంభించారు. ఎంతో హుషారుగా ఉండే లక్షిత అందరికంటే ముందుగా మెట్లను చకచకా ఎక్కుతుండగా తల్లిదండ్రులు ఆనందపడ్డారు. మెట్ల పక్కన ఉండే భక్తులు ఇచ్చిన బిస్కెట్లను తింటూ నీటి బుడగలను ఊదుతూ ఆనందంగా మెట్లు ఎక్కుతూ సాయంత్రం 6:45 గంటలకు కనిపించకుండా పోవడంతో తల్లిదండ్రులు గోడ పక్కన నక్కి తమను ఆటపట్టిస్తుందనుకున్నారు. ఎంతసేపటికి కనిపించకపోవడంతో తల్లిదండ్రులు భయంతో వణికిపోయారు. వెంటనే మెట్లు ఎక్కి చుట్టుపక్కల తీవ్రంగా గాలించారు. పెద్దగా కేకలు వేసి పిలిచినా పలకకపోవడంతో ఆందోళన చెందారు. రాత్రి 8గంటల సమయంలో పోలీసులకు ఫిర్యాదు చేయడంతో వారు రాత్రి కావడంతో తెల్లవారుజామున గాలించడంతో ఉదయం 7గంటలకు అడవిలో లక్షిత విగత జీవిగా కనిపించడంతో తల్లిదండ్రులు కన్నీటిపరమయ్యారు. ఈ విషయం తెలియడంతో పోతిరెడ్డి పాలెం గ్రామం ఒకసారిగా దిగ్భ్రాంతికి గురైంది. శుక్రవారం మధ్యాహ్నం చిన్నారి లక్షిత మతదేహం స్వగ్రామానికి చేరుకోవడంతో గ్రామంలో పెద్ద ఎత్తున మహిళలు, యువత కన్నీటి పరమయ్యారు. నిన్నటి వరకు తమ కళ్ల ముందే ఆడుతూ పాడుతు ఎంతో హుషారుగా ఉన్న చిన్నారి లక్షిత చిరుత దాడిలో మతి చెందడంతో ఒక్కసారిగా పోతిరెడ్డి పాలెం గ్రామం విషాదంలో మునిగిపోయింది.

రూ.50 లక్షలు ఎక్స్‌గ్రేషియో ప్రకటించాలి : సిపిఎం

చిరుత దాడిలో లక్షిత చిన్నారి మృతిచెందిందని, ఇందుకు టిటిడినే బాధ్యత వహించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు, డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి జయచంద్ర పేర్కొన్నారు. మృతుని కుటుంబానికి రూ.50 లక్షలు ఎక్స్‌గ్రేషియో ఇచ్చి కుటుంబంలో ఒకరికి టిటిడిలో ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఇప్పటికైనా ఇలాంటి ఘటన పునరావృతం కాకుండా శాశ్వత పరిష్కారం చూపాలని డిమాండ్ చేశారు. కేరళలో అయ్యప్పస్వామి భక్తులకు అడవి జంతువులు దాడి చేయకుండా ఉండటం కోసం టపాకాయలు కాల్చడం, శబ్దాలు చేయడం వంటి భద్రతా చర్యలు చేపడుతున్నారని తెలిపారు. భవిష్యత్‌లో ఇలాంటి ఘటనలు జరగకుండా, భక్తుల్లోనెలకొన్న అభద్రతా భావాన్ని పోగొట్టి యుద్ధప్రాతిపదికన తగు చర్యలు తీసుకోవాలని కోరారు. రుయా మార్చురీలో విగతజీవిగా ఉన్న లక్షిత మృతదేహాన్ని సిపిఎం నేతలు టి.సుబ్రమణ్యం, కె.వేణు, పి.మునిరాజా, తంజావూరు మురళి, డి.పార్థసారథితో వెళ్లి పరిశీలించారు. లక్షిత కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. తిరుపతి పార్లమెంట్ టిడిపి అధ్యక్షులు గొల్ల నరసింహయాదవ్ స్పందిస్తూ ఇది ఖచ్చితంగా టిటిడి నిర్లక్ష్యం వల్లే జరిగిందని మండిపడ్డారు.

'కంచె' వేసేందుకు తర్జనభర్జన ఎందుకు?

ఏడుకొండలవాని స్వామిని చూడాలంటే భక్తులు ఏడుకొండలూ ఎక్కాల్సిందే.. ఎక్కువగా నడకదారిలో భక్తులు పిల్లలతోనే మొక్కు తీర్చుకునేందుకు వెళుతుంటారు. దారికి అటూఇటూ గ్రిల్స్ పెట్టడంపై ఉన్నతాధికారులు తర్జన భర్జన పడుతున్నారు. వన్యప్రాణ చట్టాలు అడ్డొస్తున్నాయని ఫారెస్టు సిబ్బంది చెబుతున్నారు.. ఎన్నో చట్టాలను అలవోకగా మార్చేసే పాలకులు భక్తుల భద్రతకు ఇబ్బందిగా ఉన్న చట్టాలను ఎందుకు మార్చరో 'శ్రీవారికే తెలియాల్సి ఉంది.



సొమ్మసిల్లిన లక్షిత అమ్మమ్మ

ఉద్యమాన్ని ఉధృతం చేస్తాం

ఫ్యాప్టో మహాధర్నాలో ఐ. వెంకటేశ్వర రావు

ప్రజాశక్తి -తిరుపతి టౌన్

ఈ రాష్ట్రంలో ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న అనేక సమస్యలను తక్షణం పరిష్కరించాలని, లేనిపక్షంలో ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని తూర్పు- పశ్చిమగోదావరి జిల్లాల గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఐ.వెంకటేశ్వరరావు స్పష్టం చేశారు. రాష్ట్ర ఉపాధ్యాయ సంఘాల ఐక్య వేదిక ఫ్యాప్టో ఆధ్వర్యంలో తిరుపతి ఆర్డీవో కార్యాలయం ముందు 12 గంటల నిరసన దీక్ష జరిగింది.

జిల్లా ఫ్యాప్టో ఛైర్మన్ ముత్యాల రెడ్డి అధ్యక్షతన జరిగిన నిరసన దీక్షా శిబిరాన్ని ఫ్యాప్టో రాష్ట్ర కమిటీ సభ్యులు గాజుల నాగేశ్వరరావు ప్రారంభించారు. ఈ దీక్షా శిబిరాన్ని ఉద్దేశించి ఎమ్మెల్సీ మాట్లాడుతూ అధికారంలోకి వచ్చిన వారం రోజుల్లో సిపిఎస్‌ను రద్దు చేస్తామని జగన్మోహన్‌రెడ్డి చెప్పారని, ఇంతవరకూ అతీగతీ లేదని విమర్శించారు. అలాగే 117 జీవోను తెచ్చి రాష్ట్రంలో నూతన విద్యా విధానాన్ని అత్యుత్సాహంతో అమలు చేస్తున్నారని, దాని ద్వారా వేలాది పాఠశాలలు మూతపడడంతో పాటు వేలాది ఉపాధ్యాయ పోస్టులు గాలిలో కలిసిపోతున్నాయని, పేద పిల్లలకు విద్య అందని పరిస్థితి ఏర్పడుతోందని దుయ్యబట్టారు.

రాష్ట్రంలో ఉపాధ్యాయ బదిలీలు జరిగి మూడు నెలలు కావస్తున్నా బదిలీ పొందిన ఉపాధ్యాయులకు ఇంతవరకు జీతాలు చెల్లించలేని దుస్థితిలో రాష్ట్ర విద్యాశాఖ - ఆర్థిక శాఖ ఉన్నాయని, ఇది ఉపాధ్యాయుల పాలిట తీవ్రమైన ఆర్థిక సంక్షోభానికి దారితీస్తుందని, తక్షణం ఉపాధ్యాయులకు జీతాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఉపాధ్యాయులను బోధనకే పరిమితం చేస్తూ యాప్ లను రద్దు చేస్తామన్నారని, ఇంతవరకు యాప్లను రద్దు చేయక పోగా కొత్త కొత్త యాప్లను ప్రవేశపెట్టి ఉపాధ్యాయులను బోధనకు దూరం చేస్తున్నారని, తద్వారా పేద పిల్లలు నష్టపోతున్నారని, తక్షణం యాప్లను ఉపసంహరించుకొని ఉపాధ్యాయులను పూర్తిగా బోధనకే పరిమితం చేయాలని ఆయన కోరారు. ప్రాథమిక పాఠశాలలను బలోపేతం చేయడానికి తగిన చర్యలు తీసుకోవాలని, ఏకోపాధ్యాయ పాఠశాలలు కొనసాగకుండా తక్షణం డీఎస్సీని ఏర్పాటు చేసి ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఉపాధ్యాయులకు చట్టబద్ధంగా ప్రమోషన్లను కల్పించడంతోపాటు, వాటికి పూర్తిస్థాయిలో పే స్కేలు మంజూరు చేయాలని, అలాగే హై స్కూల్ ప్లస్ పేరుతో ఏర్పాటు చేసిన జూనియర్ కళాశాలల్లో మౌలిక వసతులను ఏర్పాటు చేసి విద్యార్థులకు నాణ్యమైన విద్య అందేటట్లు చూడాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు. రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లా కేంద్రాలలో వేలాదిమంది ఉపాధ్యాయులు 12 గంటల పాటు నిరసన దీక్ష చేస్తున్నారని ఉపాధ్యాయ సమస్యలు పరిష్కారం పరిష్కారం కానీపక్షంలో ఉద్యమాన్ని ఉదతం చేసి విజయవాడ కేంద్రంగా నిరసన దీక్షకు పూనుకుంటామని ఆయన పిలుపునిచ్చారు. తిరుపతిలో శనివారం జరిగిన 12 గంటల ఫ్యాప్టో నిరసన దీక్షలో రాష్ట్ర నాయకులు ఎస్ ఎస్ నాయుడు, మురళి కష్ణ, యువ శ్రీ మురళి, రాజశేఖర్, లక్ష్మయ్య, వెంకటరమణ, మనోజ్, వెంకటముని, దేవరాల నిర్మల, జగన్నాదం, బాలసుబ్రమణ్యం, దాసరి మునెయ్య, రమేష్ నాయుడు, వెంకట్రావు, కష్ణా రెడ్డి, మధు సూధన్ తో పాటు ఫ్యాప్టో స్టీరింగ్ కమిటీ సభ్యులు, వందలాదిమంది ఉపాధ్యాయులు పాల్గొన్నారు. అనంతరం రాత్రి 8 గంటలకు దీక్షను కొనసాగించి ముగించారు.

నూతన విద్యా విధానాన్ని ఉపసంహరించాలి

ప్రజాశక్తి - తిరుపతి టౌన్

కేంద్రం ప్రతిపాదించిన నూతన విద్యా విధానాన్ని ఉపసంహరించుకోవాలని, సిపిఎస్‌ను వెంటనే రద్దు చేసి దేశవ్యాప్తంగా పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎస్ఎస్ నాయుడు డిమాండ్‌చేశారు. తిరుపతియ ఉటిఎఫ్ కార్యాలయంలో అఖిల భారత ఉపాధ్యాయ సంఘం ఎస్‌టిఎఫ్ఐ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా పతాకాన్ని ఎగురవేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద విద్యార్థుల పాలిట గొడ్డలిపెట్టుగా ఉన్న నూతన విద్యా విధానాన్ని తక్షణమే కేంద్రం ఉపసంహరించుకోవాలన్నారు. అశాస్త్రీయమైన పాఠ్యాంశాలను సిలబస్‌లో చొప్పించడాన్ని మానుకోవాలన్నారు. విద్యార్థులకు శాస్త్రీయమైన, సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన విద్యను అందించాలన్నారు. 2004, సెప్టెంబర్ ఒకటో తేదీ నుంచి దుర్మార్గంగా ప్రవేశపెట్టిన నూతన పెన్షన్ విధానాన్ని తక్షణమే రద్దు చేసి దేశవ్యాప్తంగా పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలన్నారు. పెన్షన్ ప్రాథమిక హక్కుగా పేర్కొన్న సుప్రీంకోర్టు ఆదేశాలను పాటించి దేశవ్యాప్తంగా ఉద్యోగులందరికీ పాత పెన్షన్ వర్తింపజేయాలన్నారు. జిల్లా ప్రధాన కార్యదర్శి ముత్యాలరెడ్డి మాట్లాడుతూ కేంద్రం వద్ద పెండింగ్‌లో ఉన్న అనేక సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సెప్టెంబర్‌లో ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద ఎస్‌టిఎఫ్ఐ ఆధ్వర్యంలోపెద్ద ఎత్తున ధర్నా నిర్వహిస్తున్నామన్నారు. నవంబర్ 3న కొత్త ఢిల్లీలో నిరసన ప్రదర్శన చేపడతామన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు దేవరాల నిర్మల, కందల శ్రీదేవి, దండు రామచంద్రయ్య, బండి మధుసూదన్‌రెడ్డి, అవనిగడ్డ పద్మజ, మోహన్‌బాబు, దాసరి మునయ్య, వెంకటకృష్ణ, ఒ.విజయ్‌కుమార్, శివకుమార్, నాగార్జున పాల్గొన్నారు.

శుభ్రం చేయడం పూర్వజన్మ సుకృతం

'సుందర తిరుమల..శుద్ధ తిరుమల'లో ఈవో

ప్రజాశక్తి - తిరుమల



తిరుమల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడంలో భాగంగా నిర్వహి స్తున్న "సుందర తిరుమల-శుద్ధ తిరుమల" కార్యక్రమాన్ని శనివారం ఉదయం అలిపిరి టోల్ గేట్ వద్ద టీటీడీ ఈవో ఏవి. ధర్మారెడ్డి జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ కార్యక్రమంలో విద్యార్థులు భాగస్వా ములు కావడం పూర్వజన్మ సుకతమని ఆయన అన్నారు. తిరుమల ఘాట్ రోడ్లు, నడక మార్గాల్లో టీటీడీ విద్యా సంస్థల్లోని సుమారు 1000 మంది విద్యార్థినీ విద్యార్థులు, అధ్యాపకులతో ఈ కార్యక్రమం నిర్వహించారని చెప్పారు. పచ్చదనాన్ని పెంపొందించడం, తిరు మలను ప్లాస్టిక్ రహితంగా తీర్చిదిద్దడానికి మే 13వ తేదీ టీటీడీ లోని అన్ని విభాగాల అధికారులు , ఉద్యోగులు ఈ కార్యక్రమం నిర్వ హించారని చెప్పారు . ప్రతి మూడు నెలలకోసారి ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించడం వల్ల ఎంతో ఉపయోగం ఉంటుందన్నారు . విద్యార్థులు రెండు ఘాట్ రోడ్లు, అలిపిరి, శ్రీవారి మెట్టు నడకమార్గాల్లో ప్లాస్టిక్ వ్యర్థాలను తొలగించినట్లు చెప్పారు. విద్యార్థులకు అవసరమైన గ్లౌజులు, మాస్కులు, ప్లాస్టిక్ బ్యాగులు అందించినట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో. జేఈవో సదా భార్గవి, ఎస్వీ వేద విశ్వవిద్యాలయం విసి ఆచార్య రాణి సదాశివమూర్తి, ఎస్ వి యు విసి ఆచార్య రాజారెడ్డి, మహిళా యూనివర్సిటీ విసి ఆచార్య భారతి, రిజిస్ట్రార్ రజని, ఎస్ ఈ - 2 జగదీశ్వర్ రెడ్డి, డిఇఓ భాస్కర్ రెడ్డి పాల్గొన్నారు.

'కరుణ'కే 'శ్రీవారి' కటాక్షం

ప్రజా'దృష్టి'

ప్రజాశక్తి-తిరుపతి సిటి

తిరునగరిలో ప్రచార తిరనాళ్లు వేడెక్కింది. అధ్యాత్మిక నగరం కాస్త ఆట్టహాసంగా మారింది. అంతా ఆయన వైపే మొగ్గు. ఇదంతా స్థానిక నాయకుడికి రెండో సారి ఛైర్మన్‌గిరి దక్కడమే కారణం.

తిరుపతి శాసనసభ్యులు, సీనియర్ రాజకీయ నాయకులు భూమన కరుణాకర్‌రెడ్డిని తిరుమల తిరుపతి దేవస్థానం (టిటిడి) పాలకమండలి సభ్యులుగా రెండోసారి నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం నాలుగు రోజుల క్రితం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ పదవిలో ఇప్పటి వరకు కొనసాగిన వైవి.సుబ్బారెడ్డి పాలకమండలి కాలం ఈ నెల 8వ తేదితో ముగిసింది. వైవి.సుబ్బారెడ్డి సైతం రెండు సార్లు ఛైర్మన్‌గా కొనసాగారు. రెండు పర్యాయాలకు ముందు నుంచి ఆ పదవి కోసం ప్రయత్నం చేసినా మరో సీనియర్ నాయకులు కెఇ కృష్ణమూర్తికి రెండో 'సారీ' మొండి చెయ్యే మిగిలింది. 2024 సాదారణ ఎన్నికలు సమీపిస్తుండడంతో పదవుల పంపకాల్లో వివాదాలు ఎందుకనుకున్నారో ఏమో? ఈ సారి స్థానికుల వైపే అధినేత మొగ్గు చూపారు. రెండోసారి భూమన కరుణాకర్‌రెడ్డికి ఛైర్మన్ పదవి దక్కింది. ఆయనను ఛైర్మన్‌గా నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసినప్పటి నుంచి తిరుపతి నగరంలో పండగ వాతావరణం నెలకొంది. నిత్యం జనాల రాకతో నిండుగా ఉండే ఎంఎల్ఏ నివాసం మరింత రద్దీ పెరిగింది. రాజకీయ నాయకులు, అధికారులు, ప్రజా సంఘాలు, విద్యార్థి, మహిళా, కార్మిక, కుల సంఘాలు, ప్రజాప్రతినిధులు, మిత్రులు, శ్రేయోభిలాషులు అందరూ ఆయన ఇంటికి క్యూ కట్టారు. పుష్పగుచ్చాలు, గజ మాలలు, దుశ్శాలువలతో ఆయనను సత్కరించారు. తిరుపతి నగరం మొత్తం దైవకైంకర్యాలకే మరోసారి అంటూ నినాదాలతో వేలాది ప్లెక్సీలు వెలిశాయి. మీడియ ప్రచారాలు హోరెత్తాయి. గురువారం భూమన కరుణాకర్‌రెడ్డి టిటిడి ఛైర్మన్‌గా రెండోసారి బాధ్యతలు చేపట్టారు. ఉదయం 9 గంటలకు ఇంటి నుంచి కుటుంబ సభ్యులు, బంధువులు, శ్రేయోభిలాషులతో బయలుదేరిన ఆయన మంత్రులు, ఎంఎల్ఏలు, ప్రజాప్రతినిధులు వెంటరాగా అలిపిరికి చేరుకుని గోపూజ నిర్వహించారు. అలిపిరిపాదాల మండపం వద్ద కుటుంబ సమేతంగా ప్రదక్షణలు చేశారు. తిరుమలకు చేరుకున్న ఆయనకు పెద్ద ఎత్తున స్వాగతం లభించింది. శ్రీవారిని దర్శించుకుని, ఛైర్మన్‌గా బాధ్యతులు స్వీకరించారు. సుమారు గంటన్నరకు పైగా ఆలయంలో గడిపిన ఆయన అనుచరుల ఆనందకేరింతల మధ్య వెలుపలికి వచ్చి, అందరికి కృతజ్ఞతలు తెలియజేశారు. గతంలో ఛైర్మన్‌గా చేసిన అనుభవం, అసెంబ్లీ ఎన్నికలు సమీస్తున్న తరుణంలో స్థానికుడైన కరుణాకర్‌రెడ్డి సమస్యల పరిష్కారానికి, నగరాభివృద్ధికి చొరవ చూపుతారని అందరూ ఆశిస్తున్నారు. దశ శత దినాలకు పైగా నిరసన దీక్షలో కొనసాగుతున్న టిటిడి అటవీకార్మికులకు న్యాయం జరుగుతుందని ఆశతో ఎదురు చూస్తున్నారు. నగరానికి అంతా మంచే జరుగుతుందని ఆశిద్దాం.. తిరునగర అభివృద్ధికి సహకరిద్దాం.

'గోకుల కృష్ణ'లో అంతరిక్షయానంపై అవగాహన

ప్రజాశక్తి-సూళ్లూరుపేట



సూళ్లూరుపేట గోకులకృష్ణ కళాశాలలో శనివారం ఆజాది కా అమత్ మహెూత్సవ్ కార్యక్రమంలో భాగంగా విక్రమ్ ఏ సారా భాయ్ జన్మదినాన్ని పురస్కరించుకొని భారత అంతరిక్షయానం పైన ఇంజనీరింగ్, ఫార్మసీ విద్యార్థులకు ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా శ్రీహరికోట షార్ నుండి ప్రముఖ శాస్త్రవేత్త ఆర్.ప్రీతా పాల్గొన్నారు. ఈ సందర్భంగా భారత అంతరిక్ష పరిశోధన సంస్థను స్థాపించి ప్రపంచ స్థాయికి తీసుకు వెళ్లడంలో విక్రమ్ సారా భాయ్ పాత్ర గురించి వివరించారు. సైకిల్ మరియు ఎడ్లబండి మీద సాటిలైట్‌ను తీసుకువెళ్లే స్థాయి నుండి ఇవాళ చంద్రుని మీదకు, అంగారక గ్రహం మీదకు ఎవరి సహాయం అవసరం లేకుండా శాటిలైట్ ను పంపే స్థాయికి భారత దేశం వెళ్లగలిగిందంటే అది విక్రమ్ సారా భాయ్ స్ఫూర్తి వల్లనే సాధ్యం అయ్యిందని కొనియాడారు. ఈ సందర్భంగా అంతరిక్ష పరిశోధనల మీద విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో కళాశాల సెక్రటరీ సి.శ్రీనివాస బాబా, ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ముచ్చకాల సురేష్, ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బాలగాని పవన్ కుమార్ పాల్గొన్నారు.

15న స్విమ్స్ ఓపీకి సెలవు

ప్రజాశక్తి -తిరుపతి సిటీ ఈనెల 15న స్వాతంత్ర దినోత్సవం పురస్కరించి ఆసుపత్రిలో ఓపీకి సెలవు అని మెడికల్ సూపర్డెంట్ డాక్టర్ రామ్ ప్రకటనలో తెలిపారు. 77వ స్వతంత్ర దినోత్సవ సందర్భంగా ఈనెల 15వ తేదీన స్విమ్స్ ఆస్పత్రిలో ఓపిలకు, ఆపరేషన్ థియేటర్కు సెలవు దినమన్నారు. అత్యవసర వైద్య సేవలు అందుబాటులో ఉంటాయని, రోగులు ఈ విషయాన్ని గమనించాలని తెలిపారు.

సుప్రీంకోర్టు జడ్జిని కలిసిన టిటిడి ఛైర్మన్

తిరుమల : సుప్రీంకోర్టు జడ్జి, హైకోర్టు సిజెలను టిటిడి ఛైర్మన్ భూమన కరుణాకర్‌రెడ్డి మర్యాదపూర్వకంగా కలిసారు. శ్రీవారి దర్శనార్థం విచ్చేసిన సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బిఆర్ గావై, ఆంధ్రప్రదేశ్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్‌లకు పద్మావతి అతిథిగృహంలో స్వాగతం పలికారు. తిరుమలలోని శ్రీ వేంకటేశ్వర వేదవిజ్ఞాన పీఠాన్ని సందర్శించారు.

వాచ్ నాలుగు కోట్లకు అమ్మి పేదలకు పంచు

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి నా చేతికి కట్టుకున్న వాచ్ ధర రూ.4.60 కోటి అని ఆరోపించావ్..! మరి అదే వాచ్‌ను నీకిస్తా..! అంతే సొమ్ముకి అమ్మి నువ్వు రూ.60 లక్షలు కమీషన్ తీసుకుని తక్కిన మొత్తాన్ని పేదలకు పంచు అంటూ స్థానిక ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి టీడీపీ శ్రీకాళహస్తి నియోజవర్గ ఇన్‌ఛార్జి బొజ్జల సుధీర్‌రెడ్డికి సవాల్ విసిరారు. శనివారం తొట్టంబేడు మండలంలో జరిగిన తంగేళ్లపాళెం సింగిల్‌విండో ఛైర్మన్ ప్రమాణ స్వీకారోత్సవంలో ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి ఈ వ్యాఖ్యలు చేశారు. రాజకీయంగా ఒక వ్యక్తిపై ఆరోపణలు చేసేటప్పుడు ఆధారాలుండాలన్నారు. ఏదో అసంబద్ధపు వ్యాఖ్యలు చేసి రాజకీయంగా లబ్ధి పొందేందుకు ఎదుటి వ్యక్తిపై బురదజల్లడం సహేతుకం కాదన్నారు. దాన్ని ప్రజలు హర్షించరన్నారు. నేను కట్టుకున్న వాచ్ ధర కేవలం రూ.40 వేలే అన్నారు. 'మెరిసేదంతా బంగారం కాదు' అన్న చందంగా నా వాచీ మెరిస్తే రూ.4.60 కోటి అని ఎలా చెప్తావ్ సుధీర్ అంటూ ఎద్దేవా చేశారు. మరి నా వాచ్ అంత ధర పలికితే దాన్ని అంతే సొమ్ముకి అమ్మి నువ్వు రూ.60 లక్షలు కమీషను తీసుకుని, మూడు కోట్లను సామాజికవర్గాల పరంగా దానం చేసి, మరో కోటిని మీ పార్టీలో చెడిబతికిన కార్యకర్తలకు పంచి పెట్టాలంటూ హితవు పలికారు. గుడి నుంచి నాకు ప్రతి రోజూ లక్షలు వస్తున్నాయని చెప్పడం హాస్యాస్పదమన్నారు. మీ హయాంలోనే గుడిలో అవినీతి రాజ్యమేలిందన్నారు. నీ అవినీతి వల్లే మీ తండ్రి బొజ్జల గోపాలకృష్ణారెడ్డికి మంత్రి పదవి పోయిందన్నారు. ఎర్ర చందనం స్మగ్లింగ్‌లో నీకు వీరప్పన్‌గా గుర్తింపు ఉందని ఆరోపించారు. నా కార్లూ, ఆస్తుల గూర్చి మాట్లాడుతున్న నువ్వు..మా తాత ముత్తాతలు నెలబల్లి జమీందార్లని గుర్తించాలని సూచించారు. కోవిడ్ సమయంలో నేను ప్రజలకు చేసిన సేవ, ఈ నాలుగేళ్లలో చేసిన అభివృద్ధి ప్రజలకు తెలుసన్నారు. నీకూ..నాకూ నక్కకూ, నాగలోకానికి ఉన్నంత తేడా ఉందన్నారు. నోరుంది కదా అని ఏది పడితే అది మాట్లాడితే చూస్తూ ఊరుకోనన్నారు.

సుధీర్‌కు ఎమ్మెల్యే మధు ఛాలెంజ్

అంతర్రాష్ట్ర గంజాయి రవాణా ముఠా అరెస్టు

ప్రజాశక్తి-తిరుపతి సిటీ: సూళ్లూరుపేట పోలీసులు అక్రమ గంజాయి రవాణాను అడ్డుకొని ఐదుగురు స్మగ్లర్లను అరెస్టు చేసినట్లు తిరుపతి ఎస్పీ పరమేశ్వర్‌రెడ్డి తెలిపారు. స్థానిక జిల్లా పోలీస్ కార్యాలయంలో శనివారం విలేకర్ల సమావేశం నిర్వహించి వివరాలు వెల్లడించారు. సూళ్లూరుపేట ఆర్టీసీ బస్ స్టేషన్ వద్ద శుక్రవారం సాయంత్రం వాహనాలు తనిఖీ చేస్తుండగా ఐదుగురిని గుర్తించి వారి నుంచి రూ.3 లక్షలు విలువైన 10 ప్యాకెట్ల గంజాయిని గుర్తించారు. జలాలుద్దీన్ (34), గోవిందు (53), రాజగోపాల రవికుమార్ (53), సీద్రి సన్యాసిరావు (34), పాశం దేవా ప్రసాద్ (28)లను అరెస్టు చేశారు. సమావేశంలో సెబ్ అదనపు ఎస్పీ రాజేంద్ర, నాయుడుపేట డీఎస్పీ రాజగోపాల్ రెడ్డి, సూళ్లూరుపేట సీఐ వెంకటేశ్వర్ రెడ్డి, ఎస్సైలు శ్రీనివాస్ రెడ్డి, మనోజ్ కుమార్, జ్ఞానశేఖర్, సూళ్లూరుపేట పోలీస్ స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.



తిరుపతిలో గంజాయి స్వాధీనం

ప్రజాశక్తి తిరుపతి సిటీ : రూ.1.50 లక్షలు విలువైన 5.5 కేజీల గంజాయి తిరుపతి పోలీసులు శనివారం స్వాధీనం చేసుకున్నారు. జిల్లా స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫీసర్ ఆధ్వర్యంలో సీఐ నాగరాజురెడ్డి, వైవీ పవన్ కుమార్ సిబ్బందితో కలిసి తిరుపతిలోని మధురానగర్ శ్మశాన వద్ద తనిఖీలు చేపట్టారు. పలువురి అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వెల్లడించారు.

బాధిత కుటుంబానికి ఎమ్మెల్యే ఆర్థిక సాయం



ప్రజాశక్తి-ఏర్పేడు: చిందేపల్లి పంచాయతీ దళితవాడకు చెందిన చెన్నూరు వెంకటయ్య భార్య చెన్నూరు గీత (43) శనివారం గుండెపోటుతో మృతి చెందారు. సర్పంచ్ చెన్నూరు పెంచలయ్య నుంచి శాసనసభ్యులు బియ్యపు మధుసూదన్‌రెడ్డి సమాచారం అందుకున్నారు. ఎమ్మెల్యే ఆదేశాలయ మేరకు ఏర్పేడు మండల వైసీపీ ఇన్‌ఛార్జి గున్నేర్ కిషోర్‌రెడ్డి బాధిత కుటుంబాన్ని పరామర్శించి రూ.10 వేలు ఆర్థిక సహాయం అందించారు. బాలకృష్ణ, ఈశ్వరయ్య, వెంకటయ్య, సుమన్, సుబ్రహ్మణ్యం, ముని కుమార్ పాల్గొన్నారు.

కార్మికులను పర్మినెంట్ చేయాలి



ప్రజాశక్తి-వెంకటగిరి: కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ కార్మికులను పర్మినెంట్ చేయాలని ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ (సిఐటియు) ఆధ్వర్యంలో మున్సిపల్ కార్మికులు వెంకటగిరి మున్సిపల్ కార్యాలయంలోని మేనేజర్‌కు వినతిపత్రం అందించారు. సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు వడ్డిపల్లి చెంగయ్య, పెంచలయ్య, మోహన్, ఎ.ప్రసాద్, లచ్చుమ్మ, హరిబాబు శుభ రత్నమ్మ, ఆదిలక్ష్మి, ఆర్.మణి, వెంకటసుబ్బయ్య, పుల్లయ్య, సతీష్ పాల్గొన్నారు.

గుణశేఖర్‌కు షైన్ సేవారత్న అవార్డు



ప్రజాశక్తి-పుత్తూరు టౌన్: నారాయణవనం మండలం బ్రాహ్మణతాంగల్ గ్రామానికి చెందిన డాక్టర్ గుణశేఖర్ శనివారం భాకరాపేటలోని షైన్ ఫౌండేషన్ అండ్ హాస్పిటల్స్ నిర్వహించిన ఉత్తమ సామాజిక సేవా కేటగిరీలో అవార్డు అందుకున్నారు. కరోనా సమయంలో నారాయణవనం మండల పరిసర ప్రాంతాల్లో పలు గ్రామాల్లో కూరగాయలు, నిత్యావసర వస్తువులను ప్రజాప్రతినిధులు, అధికారుల చేతుల మీదుగా ప్రజలకు అందించడంతోపాటు అన్నదానం చేయడంతో సంస్థ గుర్తించింది.

రచయిత్రి ఉషారాణికి ...



ప్రజాశక్తి-చిన్నగొట్టిగల్లు: భాకరాపేటకు చెందిన రచయిత్రి ఉషారాణికి శనివారం భాకరాపేటలో జరిగిన కార్యక్రమానికి విచ్చేసిన తిరుపతి సీఐ శ్యామ్ సుందర్, మోటివేషనల్ స్పీకర్ జేడీ థామస్, షైన్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు కటాక్షం, అధ్యక్షులు సైలెస్ చేతులు మీదుగా షైన్ సేవారత్న అవార్డును ఉషారాణి అందుకున్నారు. పలువురు పాల్గొన్నారు.

ప్రభావతి సేవలు ప్రశంసనీయం



ప్రజాశక్తి-పుత్తూరు టౌన్: వడమాలపేట మండలం బట్టీ కండ్రిగ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో ప్రధానోపాధ్యాయులుగా పనిచేసిన ప్రభావతి సేవలు ప్రశంస నీయమని ఎంఈవో పద్మావతి పేర్కొన్నారు. శనివారం పేరెంట్స్ కమిటీ ఆధ్వర్యంలో బదిలీపై వెళ్లిన ప్రధానోపాధ్యాయులు ప్రభావతిని ఉపాధ్యాయులు, గ్రామస్థులు ఘనంగా సన్మానించారు. నెహ్రూ యువజన సేవా సంఘం అధ్యక్షురాలు జ్యోతిలక్ష్మి, ప్రధానోపాధ్యాయురాలు జయశ్రీ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యార్థులకు చిత్రలేఖన పోటీలు



ప్రజాశక్తి-క్యాంపస్: తిరుపతి ప్రాంతీయ విజ్ఞాన కేంద్రం, వే ఫౌండేషన్ సహకారంతో ఆగస్టు 15న స్వాతంత్ర్య దినోత్సవం పురస్కరించుకొని ఆజాది కా అమృత్ మహోత్సవంలో భాగంగా ప్రాంతీ య విజ్ఞాన కేంద్రంలో విద్యార్థులకు 'భారతదేశం : విజన్ 2047' అనే అంశంపై చిత్రలేఖన పోటీలు నిర్వహించారు. తిరుపతి, చిత్తూరు, కడప, అన్నమయ్య జిల్లాలకు చెందిన 39 పాఠశాలల నుంచి సుమారు 422 మంది విద్యార్థులు పోటీల్లో పాల్గొన్నారని ప్రాజెక్టు కోఆర్డినేటర్ సెల్వం తెలిపారు.

ఓటరు జాబితాను త్వరగా పూర్తి చేయాలి



ప్రజాశక్తి -గూడూరు : ఓటరు జాబితాను త్వరగా పూర్తి చేయాలని గూడూరు ఆర్డీవో కిరణ్‌కుమార్ సూచించారు. శనివారం స్థానిక ఆర్డీవో కార్యాలయంలో ఏఈఆర్‌వోలు, ఎన్నికల ఉప తహశీల్దార్లు, పొలిటికల్ పార్టీలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్ఎస్ఆర్–2024 ప్రకారం ఓటరు జాబితాలో త్వరగా పూర్తి చేయాల.. డోర్ టు డోర్ సర్వేలు, ఓటరు జాబితాలో చేర్పులు, తొలగింపులు, పేర్లు, ఫోటోలల్లో సవరణలు పూర్తి చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో తహశీల్దార్లు, ఎన్నికల ఉప తహశీల్దార్లు, నాయకులు పాల్గొన్నారు.

ఎట్టకేలకు దళితులకే భూములు



ప్రజాశక్తి-బుచ్చినాయుడుకండ్రిగ: కాటూరు రెవెన్యూ వి.ఎస్.పురం దళితులకు చెందిన భూములు తమపై పట్టా ఉందని కొందరు దౌర్జన్యంగా స్వాధీనం చేసుకుని పంటలు సాగు చేశారు. సీపీఐ నాయకుల పోరాటంతో అధికారులు సర్వే చేసి పేదలకు స్వాధీనం చేశారు. దీంతో శనివారం ఆ భూముల్లోని సజ్జ పంటను కోసుకుంటూ సంతోషం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో కృష్ణయ్య, శీను తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి సాయం




ప్రజాశక్తి-పుత్తూరు టౌన్: వడమాలపేట మండలం టి.సి.అగ్రహారం పంచాయతీలో ఇటీవల మతి చెందిన వాసు కుటుంబాన్ని మంత్రి ఆర్‌కే రోజా సోదరులు రామ్‌ప్రసాద్‌రెడ్డి పరామర్శించారు. వారి కుటుంబానికి రోజా చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో రూ.50 వేలు ఆర్థిక సాయం అందించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ, సచివాలయ మండల కన్వీనర్, మండల పార్టీ ప్రెసిడెంట్, సర్పంచులు, ఎంపీటీసీలు నాయకులు పాల్గొన్నారు.

విద్యార్థి లోకం ఉద్యమించాలి



ప్రజాశక్తి-గూడూరు టౌన్: ఏఐఎస్ఎఫ్ 88వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా గూడూరు పట్టణంలోని బీసీ సంక్షేమ వసతి గృహంలో విద్యార్థులతో కలిసి జెండా ఆవిష్కరణ చేశారు. ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు జి. శశికుమార్ పాల్గొని మాట్లాడుతూ దేశవ్యాప్తంగా విద్యారంగ సమస్యలపై ఏఐఎస్ఎఫ్ చేస్తున్న పోరాటాల గురించి విద్యార్థులకు తెలియజేశారు. ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం అవలంభిస్తున్న విద్యా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా పోరాటాలు నిర్వహిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ పట్టణ నాయకులు హేమంత్, చైతన్య, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

వైసీపీతో యువశక్తి నిర్వీర్యం




ప్రజాశక్తి-పుత్తూరు టౌన్: యువశక్తిని వైసీపీ ప్రభుత్వం నిర్వీర్యం చేసిందని నగరి నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి గాలి భాను ప్రకాష్ పేర్కొన్నారు. గుంటూరు జిల్లాలో దిగ్విజయంగా సాగుతున్న యువగళం పాదయాత్రలో నారా లోకేష్‌ను కలిసి ఉద్యోగాలు అని చెప్పి యువత భవిష్యత్తును జగన్‌మోహన్‌రెడ్డి నాశనం చేశారని తెలిపారు.

రాష్ట్రస్థాయి రోల్‌బాల్ పోటీలు ప్రారంభం

ప్రజాశక్తి-తిరుపతి సిటీ: సబ్ జూనియర్ రోల్ బాల్ పోటీలను శనివారం తిరుపతిలోని శ్రీనివాస స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో జాయింట్ కలెక్టర్ డి.కె. బాలాజీ ప్రారంభించారు. పోటీలలో పది జిల్లాల క్రీడాకారులు పాల్గొన్నారు. జేసీ మాట్లాడుతూ విద్యతో పాటు క్రీడలూ ముఖ్యమని పేర్కొన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర రోల్ బాల్ వైస్ ప్రెసిడెంట్ జి.ప్రతాప్, రాష్ట్ర కార్యదర్శి అనిల్ కుమార్ రెడ్డి, ఉమ్మడి చిత్తూరు జిల్లా కార్యదర్శివి.జి.ప్రేమ్‌నాథ్, టెక్నికల్ అడ్మినిస్ట్రేటివ్ డైరెక్టర్.షేక్ అబ్దుల్ సలాం, వివిధ జిల్లాల కార్యదర్శులు పాల్గొన్నారు.

నిరసన తెలిపితే కేసులా : గంగోటి



ప్రజాశక్తి - వెంకటగిరి: వెంకటగిరి పట్టణం టిడిపి రాష్ట్ర కార్యదర్శి గంగోటి నాగేశ్వరావు నివాసంలో మీడియా సమావేశం శనివారం జరిగింది. ఈసమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈనెల 4 న చిత్తూరు జిల్లా పుంగనూరు పర్యటనలో మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పై రాళ్ల దాడి ఘటనపై ఖండిస్తూ వెంకటగిరి పట్టణంలో క్రాస్ రోడ్డు వద్ద మాజీ ఎమ్మెల్యే కురుగొండ రామకృష్ణ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారన్నారు. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి దిష్టిబొమ్మ దగ్ధం ఆందోళన నిరసన కార్యక్రమంలో పాల్గొన్న టిడిపి నాయకులు ఆందోళనకారులు పై స్థానిక పోలీస్ స్టేషన్ లో హత్య కేసు 19 మంది పై నమోదు చేసినట్లు తెలిపారు. ఈ సంఘటనపై టీడీపీ శ్రేణులు స్పందిస్తూ గత ప్రభుత్వాలలో ఎన్నో ధర్నాలు, నిరసనలు, ఆందోళనలు, ర్యాలీలు దిష్టిబొమ్మ దగ్ధం వంటి కార్యక్రమాల నిర్వహించేవారని, ప్రభుత్వం మొండి వైఖరితో ఎన్నో కేసులు నమోదు చేయిస్తోందన్నారు. ఇలాంటి చర్యలను ఖండిస్తున్నామన్నారు. తప్పుడు కేసులు వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వెంకటగిరి, డక్కిలి, బాలాయపల్లి మండల అధ్యక్షులు రాయి మస్తాన్ నాయుడు, పప్పు చంద్ర మౌళి రెడ్డి పాల్గొన్నారు.

టీడీపీ పథకాలపై ప్రజల్లో అవగాహన

ప్రజాశక్తి-సూళ్లూరుపేట : తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు భవిష్యత్ గ్యారంటీ అంటూ మహా శక్తి పేరుతో ఇటీవల మినీ మేనిఫెస్టోను విడుదల చేశారు. ఈ మహా శక్తి పథకాలను గురించి ప్రజల్లో అవగాహన తీసుకురావడానికి ప్రచారాన్ని ప్రారంభించారు.సూళ్లూరుపేట మున్సిపాలిటీ పరిధిలో ఈ కార్యక్రమం ప్రారంభం సందర్భముగా శనివారం ముందుగా పట్టణ టిడిపి అధ్యక్షుడు ఆకుతోట రమేష్ ఆధ్వర్యంలో సాయి నగర్ లోని సాయిబాబా మందిరంలో పూజలు నిర్వహించారు. ఈ పూజల్లో నియోజకవర్గం ఇంచార్జి నెలవల సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ తిరుపతి పార్లమెంట్ మహిళా అధ్యక్షురాలు చక్రాల ఉష, అధికార ప్రతినిధి తిరుమూరు సుధాకర్ రెడ్డి, పట్టణ కార్యదర్శి ఏజీ. కిషోర్, రాష్ట్ర యువత ఉపాధ్యక్షుడు మాధవ్ నాయుడు, ఎస్సీ సెల్ పెంచలయ్య తదితరులు పాల్గొన్నారు.

అంగళ్లే టార్గెట్‌గా.. దొంగల భయం

ప్రజాశక్తి-సూళ్లూరుపేట: సూళ్లూరుపేట పట్టణంలో గత 15 రోజులుగా దొంగల భయం ఎక్కువగా ఉంది. బజార్ వీధులలోని షాపులను టార్గెట్ గా చేసుకొని రాత్రి సమయాలలో చోరీలకు ప్రయత్నిస్తున్నారు. కూరగాయల మార్కెట్ సెంటర్లో మూడు షాపులకు దొంగలు షెట్టర్ తాళాలు పగలగొట్టి చోరీకి విఫలయత్నం చేశారు. శుక్రవారం రాత్రి కూడా గాండ్ల వీధి లోని ఎస్బిఐ ఎటిఎం పక్కనే నిర్మాణంలో ఉన్న భవంతిలో చోరీ జరిగింది. భవనం మొదటి అంతస్తుకు ఉన్న తాళం పగలగొట్టి లోపల వైరింగ్ కోసం స్విచ్ బోర్డులకు తగిలించి ఉంచిన విద్యుత్ వైర్లను కత్తిరించి ఎత్తుకెళ్లారు. అలాగే అక్కడ వుడ్ వర్క్ చేస్తున్న కార్మికులకు సంబంధించి ఐదు రకాల యంత్రాలనూ దొంగలు తీసుకెళ్లారు. ఇలా వరుస చోరీలు జరగడంతో పట్టణంలో రాత్రి సమయాలలో పోలీస్ పహారా ఉన్నట్టా, లేనట్టా అన్న సందేహాన్ని పట్టణ వాసులు వ్యక్తం చేస్తున్నారు. పోలీసుల నిఘా సక్రమంగా లేకపోవడంతో తమిళనాడు నుండి బైకులపై వచ్చి ఇక్కడ చోరీలకు పాల్పడుతున్నారనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఇప్పటికైనా పోలీసులు రాత్రి సమయాలలో పట్టణ వీధుల్లో పోలీస్ పహారాను పెంచాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

మామిడిలో అంతర పంటల సాగుపై శిక్షణ



ప్రజాశక్తి-రేణిగుంట: మామిడిలో అంతర పంటల సాగుపై అవగాహన ఉండాలని రాస్ కృషి విజ్ఞాన కేంద్రం సీనియర్ శాస్త్రవేత్త శ్రీనివాసులు, శాస్త్రవేత్త సుధాకర్ తెలిపారు. శనివారం రాస్ కృషి విజ్ఞాన కేంద్రం కరకంబాడి ఆధ్వర్యంలో మామిడిలో అంతర పంటల సాగుపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా శాస్త్రవేత్తలు మాట్లాడుతూ సంవత్సరాల లోపు వయసు ఉన్న మామిడి తోటలలో ఖరీఫ్ సీజనకు అనుకూలమైన కూరగాయలు, పూల పెంపకం చేసే ఎకరాకు రూ.50 వేలు వరకు అదనపు ఆదాయం పొందవచ్చన్నారు. కార్యక్రమంలో కొమరగుంట, వెదురు కుప్పం మండలం, చిట్టెచెర్ల, చిన్నగొట్టిగల్లు మండలం రైతులు పాల్గొన్నారు.

రాయలసీమకు నీటి హక్కులు లేవా?



ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): రతనాల సీమగా పేరుగాంచిన రాయలసీమ నేడు పాలకుల నిర్లక్ష్యం కారణంగా రాళ్ల సీమగా మారుతోందని, రాయలసీమకు నీటిపై హక్కులు లేవా అని ప్రత్యేక రాయలసీమ సాధన సమితి వ్యవస్థాపక అధ్యక్షులు కూరపాటి సురేష్ బాబు ప్రభుత్వాలను ప్రశ్నించారు. శనివారం తిరుపతి ప్రెస్ క్లబ్ లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాయలసీమ ప్రాంతంలో 550 సంవత్సరాలకు ముందు రాజులు ఎంతో దూర దష్టితో చెరువులు ఏర్పాటు చేశారన్నారు. శ్రీశైలంలో 885 అడుగులు నీటిమట్టం ఉన్నా.. కేసీ కెనాల్ కు నీరు వదలడం లేదన్నారు. కార్యక్రమంలో బీసీ విభాగం నాయకులు నరేష్, మైనారిటీ నాయకులు అబ్దుల్ రఫీ, సీనియర్ రాయలసీమ నాయకులు నాగరాజు రెడ్డి పాల్గొన్నారు.

గద్దర్ ఆశయాలను కొనసాగిద్దాం



ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): ప్రజా యుద్ధనౌక, ప్రజా గొంతు, సమాజంలోని అసమానతలపై, హక్కులపై తన కలంతో, గళంతో ప్రజల్లో చైతన్యం నింపిన గద్దర్ ఆశయాలను కొనసాగిద్దామని పలువురు కవులు, రచయితలు, మేధావులు అన్నారు. శనివారం తిరుపతి నగర పరిధిలోని గంధమనేని శివయ్య భవన్లో యువశ్రీ మురళి, డాక్టర్ నెమిలేటి కిట్టన్న, అభ్యుదయ రచయితల సంఘం ఆధ్వర్యంలో గద్దర్ సంస్మరణ సభను నిర్వహించారు. కార్యక్రమంలో కవులు, రచయితలు తమటం రామచంద్రారెడ్డి, మన్నవ గంగాధర ప్రసాద్, పేరూరు బాలసుబ్రమణ్యం, మల్లారపు నాగార్జున, కలువగుంట రామమూర్తి, టెంకాయల దామోదరం, ఆకుల మల్లేశ్వరరావు, ఎస్టీయూ నాయకులు గాజుల నాగేశ్వరరావు, సిపిఐ నాయకులు రామానాయుడు, సురేంద్ర, చంద్రారెడ్డి, లక్ష్మీ నారాయణ తదితరులు పాల్గొన్నారు.

బండ్ల వెంకటేశ్వరరావుపై దాడి అమానుషం

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): చీరాలలో సీనియర్ నాయకులుగా పేరుగాంచిన బండ్ల వెంకటేశ్వరరావు అలియాస్ బాబు పై జరిగిన దాడిని తీవ్రంగా ఖండిస్తున్నామని జాతీయ చేనేత ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షులు సుంకర చిన్నరెడ్డి బాబు ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల విజయవాడలో చేనేత నాయకులపై దాడి చేశారని, ఇప్పుడు క్రియాశీలక రాజకీయాల్లో రెండు దశాబ్దాలుగా వివిధ పదవుల్లో ప్రజా సేవ చేస్తున్న బండ్ల బాబు 10వ తేదీన రామన్న పేట వార్డు మెంబర్ అభ్యర్థిత్వానికి నామినేషన్ దాఖలు చేయడానికి వెళ్లగా అక్కడ ఉన్న అధికార పార్టీకి సంబంధించిన వారు కొందరు దాడి చేసి గాయపరిచారన్నారు. దాడులకు తెగబడ్డ వారిపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

వెంకటేశన్‌కు సన్మానం



ప్రజాశక్తి -రేణిగుంట: ఏజెన్సీలతో సమస్య ఉంటే భయపడకుండా కమిషన్ దృష్టికి తెస్తే రాజ్యాంగపరంగా ఏర్పడ్డ కమిషన్ న్యాయం చేయడం జరుగతుందని జాతీయ సఫాయ్ కరమ్ చారిస్ ఛైర్మన్ ఎం. వెంకటేశన్ అన్నారు. శనివారం సాయంత్రం రేణిగుంట పాత విమానాశ్రయ సమావేశ హాల్ లో జాతీయ సఫాయి కరం చారి ఛైర్మన్ ఎయిర్ పోర్ట్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన్ను సన్మానించారు. ఆపరేషన్స్ డైరెక్టర్ శివప్రసాద్, చీఫ్ సెక్యూరిటీ ఆఫీసర్ రాజశేఖరరెడ్డి, ఎస్సీ వెల్ఫేర్ ఆఫీసర్ చెన్నయ్య, అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ కష్ణారెడ్డి, మునిసిపల్ కమిషనర్లు గూడూరు వెంకటేశ్వర్లు, శ్రీకాళహస్తి రమేష్ బాబు, వెంకటగిరి వెంకటరాముడు, పనోరమా ఏజెన్సీ ప్రతినిధి వినోద రెడ్డి అధికారులు పాల్గొన్నారు.

ఘనంగా ఏఐఎస్ఎఫ్ ఆవిర్భావ దినోత్సవం



ప్రజాశక్తి-క్యాంపస్: తిరుపతి ఎస్వీ యూనివర్సిటీ ప్రకాశం భవన్ ఎదుట సుందర్ రాజు అధ్యక్షతన ఏఐఎస్ఎఫ్ 88వ ఆవిర్భావ ఉత్సవాలు నిర్వహించారు. మాజీ నాయకులు శంకర్, విజయ్ భాస్కర్ జెండాను ఎగురవేశారు. ఏఐఎస్ఎఫ్ తిరుపతి జిల్లా కార్యదర్శి బండి చలపతి, మాజీ రాష్ట్ర నాయకుల సుంకు రవీంద్ర, చిన్న, నవీన్, వినయ్, గర్ల్ నాయకులు శరణ్య, శ్రావణి,యూనివర్సిటీ అధ్యక్షులు వేణు, యువ, రవి, యోగేష్,వెంకీ, నగర నాయకులు తేజ, హరి, ప్రసాద్, శివ, నాయకులు పాల్గొన్నారు.

నిమ్మ రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలి



ప్రజాశక్తి-బాలాయపల్లి : రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలని కాంగ్రెస్ పార్టీ వెంకటగిరి నియోజకవర్గ కన్వీనర్ పంట శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో బాలాయపల్లి తహశీల్దారు కార్యాలయం ఎదుట శనివారం నిరసన తెలిపారు. నిమ్మకాయ నిల్వ చేసేందుకు స్టోరేజీ కార్యాలయం ఏర్పాటు చేయాలన్నారు. సబ్సిడీ ధరకు రైతులకు నిమ్మ మొక్కలను అందజేయాలని కోరారు.

ప్రొఫెసర్లకు జీవిత సాఫల్య పురస్కారాలు

ప్రజాశక్తి-క్యాంపస్: శ్రీ పద్మావతి మహిళా యూనివర్సిటీ ప్రొఫెసర్లకు జీవిత సాఫల్య పురస్కారాలు వచ్చాయి. ఆ వర్సిటీ బయోటెక్నాలజీ విభాగ ప్రొఫెసర్ జాన్ సుష్మా, జర్నలిజం విభాగ ప్రొఫెసర్ త్రిపుర సుందరి పురస్కారాలు పొందారు. బోధన పరిశోధన, విస్తరణ రంగాల్లో వీరు చేసిన విశేష కృషికి గుర్తింపుగా ఈ అవార్డులు అందజేశారు. శనివారం చెన్నైలో నిర్వహించిన అవార్డు ప్రదాన సభలో వీరు అవార్డులను స్వీకరించారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

ప్రజాశక్తి-వరదయ్యపాలెం: రోడ్డు ప్రమాదంలో యువకుడు మతి చెందిన సంఘటన శనివారం మండలంలో జరిగింది. ఎస్సై నాగార్జున రెడ్డి అందించిన వివరాల మేరకు.. తడ మండలం వేనాడుకు చెందిన రాజా (24) అనే యువకుడు శనివారం వరదయ్యపాలెం మండలం సీఎల్ఎన్ పల్లి లోని తన చిన్నాన్న ఇంటికి ప్రసాదం ఇచ్చి సాయంత్రం తన బైకులో తిరుగు ప్రయాణం అయ్యాడు. తన వెంట చిన్నాన్న కుమార్తె కౌసల్యను తీసుకువెళుతుండగా కళత్తూరు రోడ్డు సమీపంలో సంతవేలూరు, వరదయ్యపాలెం మార్గంలో ఇటుకల ట్రాక్టర్ ఢీ కొనడంతో తీవ్రంగా గాయపడ్డాడు. ఎస్సై నాగార్జున రెడ్డి సంఘటన స్థలానికి చేరుకుని బాధితుడు ని 108లో సూళ్లూరుపేట కు తరలిస్తుండగా మార్గమధ్యలో మతి చెందాడు. ప్రమాదంలో కౌసల్య కి స్వల్ప గాయాలు అయింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై తెలిపారు.

ఘనంగా నాదేశం.. నా భూమి



ప్రజాశక్తి-రేణిగుంట: ఎందరో మహనీయుల త్యాగఫలమే భారతదేశానికి స్వాతంత్ర్యం వచ్చిందని విప్పమాను పట్టెడ సర్పంచ్ లక్ష్మీపతి రెడ్డి తెలిపారు. శనివారం విప్పమానుపట్టెడలో నా దేశం–నా భూమి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామస్థులు,ఉపాధి హామీ కూలీలు పాల్గొన్నారు.



బాలాయపల్లి: స్వాతంత్ర్యం కోసం పోరాడిన వారిని స్మరించుకోవాలని ఎంపీపీ భాస్కర్‌రెడ్డి తెలిపారు. శనివారం మండలంలోని సిద్దాగుంట, ఊట్లపల్లి, గొట్టికాడు, జయంపు, హస్త కావేరి, పిగిలాం, నిడిగల్లు గ్రామ పంచాయతీల్లో నా భూమి–నా దేశం నిర్వహించారు. కార్యక్రమంలో ఏపీవో మత్యుంజయరావు, ఈవోపీఆర్డీ మోహన్ రాజు, ఉపాధి హామీ సిబ్బంది, కూలీలు పాల్గొన్నారు.

టీడీపీ గెలుపుతోనే మహిళల సాధికారత



ప్రజాశక్తి -గూడూరు: టీడీపీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబునాయుడు ఆదేశాలు మేరకు భవిష్యత్తుకి గ్యారంటీ కార్యక్రమాన్ని గాంధీనగర్‌లో నిర్వహించారు. వైసీపీ వ్యతిరేక విధానాలను ప్రజలకు తెలిపారు. మాజీ ఎమ్మెల్యే పాశిం సునీల్ కుమార్ మాట్లాడుతూ గత టీడీపీప్రభుత్వంలోనే అభివృద్ధి పనులు జరిగాయన్నారు. నాయకులు ఏసుపాక పెంచలయ్య, శ్రీపాదం ఉదయ్, బట్టేపాటి కృష్ణయ్య, రావూరు సురేంద్ర, కె వి నాయుడు తదితరులు పాల్గొన్నారు.

అధ్యాపకుల పోస్టులను భర్తీ చేయండి



ప్రజాశక్తి - క్యాంపస్ : ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని డిగ్రీ కళాశాలలో, విశ్వవిద్యాలయాల్లో ఖాళీగా ఉన్న అధ్యాపకుల పోస్టులను వెంటనే భర్తీ చేయాలని కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ కు ఏబీఎస్ఆర్ఎమ్ సంఘం రాష్ట్ర నేతలు వినతిపత్రం ఇచ్చారు. ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఆచార్య వైవి రామిరెడ్డి మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని విద్యారంగ సమస్యలను వారి దష్టికి తీసుకువెళ్లడం జరిగిందన్నారు. కార్యక్రమంలో ఆ సంఘం ప్రధాన కార్యదర్శి డాక్టర్ గంగినేని రంగనాథ్, మీడియా ఇన్‌ఛార్జి డాక్టర్ మహేంద్రనాథ్ చౌదరి, సంఘం రాష్ట్ర అధ్యక్షులు శ్రావణ్ కుమార్, ప్రధాన కార్యదర్శి బాలాజీ, ఏపీఆర్ ఎస్ ఎం జాతీయ సహ కార్యదర్శి రాజశేఖర్ రావు, పాల్గొన్నారు.

నిరసన తెలిపితే కేసులా?



ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): పుంగనూరులో చంద్రబాబు పర్యటన సందర్భంగా జరిగిన గొడవలను నిరసిస్తూ వెంకటగిరిలో టిడిపి నాయకులు, తెలుగు యువత ఆధ్వర్యంలో నిరసన తెలియజేయడానికి ప్రయత్నం చేస్తే హత్యాయత్నం కేసులు నమోదు చేయడం ఎంతవరకు సబబని తిరుపతి పార్లమెంటు తెలుగు యువత అధ్యక్షులు కృష్ణ యాదవ్, తెలుగు యువత రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు పెరుమాళ్ మధు, ఆర్ పి శ్రీనివాసులు రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. శనివారం తిరుపతి ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ నిరసన తెలియజేయడానికి వచ్చిన మాజీ ఎమ్మెల్యే రామకష్ణ టిడిపి నాయకులు కె.వి ప్రసాద్ తో పాటుగా 16 మందిపై వెంకటగిరి పోలీసులు హత్యాయత్నం కేసులు నమోదు చేశారని అన్నారు. తిరుపతి నగరంలో ప్రతిపక్ష పార్టీలకు సంబంధించిన వారి శవయాత్రలు చేస్తూ దిష్టిబొమ్మలను దహనం చేస్తుంటే పోలీసులకు ఇటువంటి నిరసనలకు చట్టం వర్తించదని గుర్తుకు రాలేదా అని ప్రశ్నించారు. శ్రీకాళహస్తి నియోజకవర్గంలో ఎన్నికల నోటిఫికేషన్ ను లెక్కచేయకుండా స్థానిక ఎమ్మెల్యే తన రాజ్యాంగాన్ని అమలు చేస్తున్నట్టుగా ఉందని ఎద్దేవా చేశారు. అభ్యర్థుల దరఖాస్తు ఫారాలను చించి వేయడం, అభ్యర్థులను కిడ్నాప్ చేసి బెదిరింపులకు పాల్పడటం ప్రజాస్వామ్యమా అని ప్రశ్నించారు. కార్యక్రమంలో తెలుగు యువత నాయకులు బాబి, లోకేష్, గోపి, దిలీప్, జైకృష్ణ, వెంకటేష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.